గొర్రెల యూనిట్ల పంపిణీ

గొర్రెల యూనిట్లతో లబ్ధిదారులు

సిరికొండ, అక్టోబర్ 7 : మండలంలోని న్యావనంది గ్రామంలో గొల్ల కుర్మ లబ్ధిదారులకు 6 గొర్రెల యూనిట్లను సర్పంచ్ కనుక శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్ల కుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి బాబూరావు, పశువైద్య సహాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, గొల్ల, కుర్మ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నుడా చైర్మన్‌కు సన్మానం

నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డిని సన్మానిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈగ సంజీవ్‌రెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆయన నుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి అరవింద్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు

నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ

నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి

ధర్పల్లి, అక్టోబర్ 7 : మండలంలోని గుడితండా పంచాయతీ పరిధిలో ఉన్న భగవాండ్ల తండాలో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2 లక్షలతో నీటి తొట్టె నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీ లతాశ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ సబావత్ శ్రీనివాస్‌నాయక్, వీడీసీ చైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, తండా పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

వచ్చే నెల 23న మాదిగల యుద్ధభేరి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయమైన వాటా కోసం ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ నాయకత్వంలో నవంబర్ 23న మాదిగల యుద్ధభేరి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి సల్లూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుండారం మోహన్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జిల్లాకేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. మాదిగల జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని, పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. డప్పు కొట్టేవారికి, చెప్పులు కుట్టే వృత్తిదారులకు రూ. 4 వేల పెన్షన్ అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు చిలుముల పోసాని , నియోజకవర్గ ఇన్‌చార్జీలు మోతె భూమన్న, దేవన్న, జిల్లా కార్యదర్శి సాయిబాబా, టౌన్ అధ్యక్షుడు సుధాకర్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పాల్దా జీపీలో డీఎల్పీవో విచారణ

- ట్యాబ్ సర్టిఫికెట్, చెక్కులపై సంతకం చేయని జాయింట్ చెక్‌పవర్ కలిగిన వార్డుమెంబర్
- సిబ్బందికి మూడు నెలలుగా అందని వేతనాలు

పాల్దా జీపీలో విచారణ చేపడుతున్న నిజామాబాద్ డీఎల్పీవో నాగరాజు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 7 : మండలంలోని పాల్దాలో జాయింట్ చెక్‌పవర్ కలిగిన వార్డుమెంబర్ నరేశ్.. సర్పంచ్ మధ్య మనస్పర్థల కారణంగా సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పాల్దా జీపీ కార్యాలయంలో నిజామాబాద్ డీఎల్పీవో నాగరాజు, ఎంపీవో మధురిమ శనివారం విచారణ చేపట్టారు. జాయింట్ చెక్‌పవర్ కలిగి ఉన్న వార్డుమెంబర్ నరేశ్ ట్యాబ్ సర్టిఫికెట్‌పై సంతకం చేయకపోవడంతో ట్రెజరీ కార్యాలయం నుంచి చెక్కులు జనరేట్ చేసే పరిస్థితి లేకుండా పోయిందని డీఎల్పీవో తెలిపారు. మూడు నెలల నుంచి జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించలేదని, కరెంట్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ట్యాబ్ సర్టిఫికెట్‌తోపాటు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.23 వేల బిల్లు చెక్కులపైన నరేశ్ సంతకం పెట్టకపోవడంతో ఇరువురి మధ్య అవగాహన లోపం ఏర్పడి, మనస్పర్థలకు దారి తీసినట్లు వివరించారు. రూ.23 వేల చెక్కుకు సంబంధించిన పనుల్లో అవకతవకలున్నాయనే అనుమానంతో చెక్కుపై సంతకం చేయలేదని వార్డుమెంబర్ నరేశ్ విచారణ అధికారికి వివరించారు. మూడు నెలలుగా తమకు జీతాలు అందడం లేదని, పనికి రాబోమని జీపీ సిబ్బంది తెలుపడంతో.. నాలుగు రోజుల్లో వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో హామీ ఇచ్చారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్పీవో తెలిపారు.

హెల్త్ హైజినిక్ కిట్ల పంపిణీ

హైజినిక్ కిట్లతో విద్యార్థులు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : నగరంలోని కసాబ్‌గల్లీలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో హెల్త్ హైజినిక్ కిట్లను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు హాజరై మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 2500 హెల్త్ హైజినిక్ కిట్లు అందజేశామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. డివిజన్ చైర్మన్, డాక్టర్ శ్రీశైలం విద్యార్థులు ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి కరిపె రవీందర్, అర్బన్ చైర్మన్ నరాల సుధాకర్, డివిజన్ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణ ప్రభుత్వ బాలికల వసతిగృహం వార్డెన్ రాధారాణి, ఉపాధ్యాయిని జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

- రూ.5 లక్షల నగదు సీజ్

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 7 : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తరచూ వాహనాల తనిఖీ చేపడుతున్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం సాయంత్రం చేపట్టిన వాహనాల తనిఖీలో ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీపీ సత్యనారాయణ వెల్లడించారు. నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజ్‌కమాన్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టగా.. ద్విచక్రవాహనంపై వచ్చిన బూరుగుపల్లి వీరేందర్ అనే వ్యక్తి వద్ద రూ.5 లక్షల నగదు లభించినట్లు పేర్కొన్నారు. ఈ డబ్బులకు సంబంధించి అతడి వద్ద ఎలాంటి రసీదులు, ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు సీపీ వెల్లడించారు. తదుపరి విచారణ కోసం డబ్బులను ఐటీ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 7 : నిజామాబాద్ నగర శివారులో జరిగిన రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే ఎస్సై తాహూ నాయక్ తెలిపారు. అర్సపల్లి రైల్వే గేట్ ఏరియా, లతీఫ్ కాలనీ దగ్గర రైలు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు గుర్తించిన పోలీసులు.. మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదని, కుడి చేతికి రబ్బర్ బ్యాండ్ ఉన్నదని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి సంబంధీకులు 87126 58591, 87125 68511 నంబర్లకు ఫోన్ చేయాలని హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ సూచించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువతకు సన్మానం

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 7 : మండలంలోని కేశ్‌పల్లి గ్రామానికి చెందిన నలుగురు యువకులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన అజ్మీరా రాజా, బదావత్ యశ్వంత్, ఉప్పులపు నితిన్, కొట్టం రాజశేఖర్‌ను గ్రామపంచాయతీ కార్యాలయంలో కౌండిన్య అకడమిక్ చైర్మన్, పీఈటీ రాజాగౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మైదం మహేశ్వర్, ఉపసర్పంచ్ మొత్కురి భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు మున్నూరు గంగాధర్, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువకులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 7 : నగరంలో ఇతిహాస సంకలన సమితి -ఇందూరు ఆధ్వర్యంలో కొనసాగుతున్న అశ్మక చరిత్ర గ్రంథాలయానికి జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ చరిత్ర పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన తాత బెల్లాల్ మాణిక్‌రెడ్డి 99వ జయంతి సందర్భంగా రూ. 12 వేల విలువ చేసే పుస్తకాలను అందజేసినట్లు ఆమె తెలిపారు. ఇతిహాస సంకలన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్ మాట్లాడుతూ... ప్రారంభదశలో ఉన్న చరిత్ర గ్రంథాలయానికి చారిత్రక పుస్తకాలు ఎంతో అవసరమని, చరిత్ర అధ్యయనకారులకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. చరిత్రకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయానికి అందజేసి సహకరించాలని ఆయన కోరారు. ఇతిహాస సంకలన సమితి ప్రతినిధులు మోహన్‌దాస్, వివేక్, రిషి తదితరులు పాల్గొన్నారు.